www.prajasakti.com

# ప్రజాశక్తి

గురువారం 8 ఫిబ్రవరి 2024

ఎన్నికల విధులపై నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

# పెద్దాసుపత్రి వైపు.. పేదల ఎదురుచూపు..

- 100 పడకల ఆసుపత్రి కలేనా..
- అప్గ్రేడ్ జరిగేది ఎప్పటికో..
- అధినేతల అలసత్వం పేదలకు శాపం..

**మూడు రాష్ట్రాల కూడలి... లక్షకు పైగా జనాభా... విభిన్న వాతావరణ పరిస్థితులు... పెద్దఆసుపత్రి లేదు... వందల మంది రోగులు... పదుల సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న క్షతగాత్రులు... కష్టమౌతున్న వైద్య సౌకర్యాలు... నిపుణులే లేని ఆసుపత్రి శస్త్రచికిత్సలు వూసేలేదు.. అత్యవసర పరిస్థితుల్లో పక్క రాష్ట్రానికో, మెడికల్ కళాశాలకో వెళ్లాల్సిన దుస్థితి. 30 పడకలతో మూలుగుతూ నేతల హామీలకే పరిమితమైన 100 పడకల ఆసుపత్రి. అత్యవసరాల్లో పేదల జేబులు ఖాళీ అయినప్పటికీ వైద్యం అందని ద్రాక్షగా మిగులుతోంది. వంద పడకల ఆసుపత్రి కలగానే మిగిలిపోతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.**

**ప్రజాశక్తి- వీకోట:** మండలంలో సుమారు లక్ష 20 వేల జనాభా కలిగి ఉంది. 18 గ్రామ పంచాయతీలు, 25 గ్రామ సచివాలయాలున్నాయి. జిల్లాలో పెద్ద మండలం. రెండు జాతీయ రహదారులు మండలం గుండా వెళ తున్నాయి. అంతేకాకుండా కర్ణాటక, తమిళనాడు సరిహద్దు కావడంతో ఆ ప్రాంతానికి చెందిన ప్రజలు కూడా ఈ ఆసుపత్రి నుండి సేవలు పొందుతున్నారు. ఇంత పెద్ద మండలానికి 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం మాత్రమే ఉంది. ఒక పిహెచ్‌సి కేంద్రం 7ఏళ్ల క్రితం ఓగులో ఏర్పాటు చేశారు. మరొకటి హామీలకే పరితమైంది. పేదలు వైద్యసేవలకు పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం బాటపడుతున్నారు. మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం వసతులకు నోచుకోలేదు. కొన్నేళ్ల క్రితం 30 పడకల ఆసుపత్రిని ప్రభుత్వం స్థాపించింది. రోజుకు 500నుంచి 600మంది రోగులు ఆసుపత్రిలో సేవల కొరకు వస్తుంటారు. గత పాలకులు 100పడకల ఆసుపత్రిగా మారుస్తామని మాటలు చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదవీకాలం ముగుస్తోంది. ఇంతవరకు పట్టించుకున్న పాపానపోలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజు తలనొప్పి, జ్వరం, ఒళ్లనొప్పులు, మధుమేహం, రక్తపోటు, రక్తపరీక్షలు తదితర చిన్న జబ్బులకు మాత్రమే ఈ ఆసుపత్రిలో సేవలు పొందుతున్నారు.

రోడ్డు ప్రమాదాల్లో కాళ్ళు, చేతులు విరగడం, ఇతర అవయవాలు దెబ్బతిన్న సందర్భాల్లో సేవలు పొందేందుకు అవకాశమే లేదు. తిరుపతి, బెంగళూరు, వేలూరు కుప్పం, కోలార్ మెడికల్ కళాశాలకు వెళ్లాల్సి వస్తోందే. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైద్యులు ఉన్న రోగులకు కావాల్సిన సౌకర్యాలు అందుబాటులో లేదు. అరకొర సేవలతో నెట్టుకొస్తున్నారు. 500 మంది రోగులకు మందులు ఇవ్వడానికి ఒకే ఒక్క ఫార్మసిస్ట్ ఉండడంతో రోగులు పడరాని పాట్లు పడుతున్నారు. గంటల తరబడి మందుల కోసం బారులు తీరుతున్నారు.

అనారోగ్యంతో ఆసుపత్రికి వస్తే మందుల కోసం నిలబడి నిలబడి సొమ్మసిల్లి పడిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఒకే ఫార్మసిస్ట్ ఉండడంతో మందులు పంపిణీ చేయలేక.. వాటి వివరాలు నమోదు చేసుకోలేక ఫార్మసిస్ట్ సైతం తీవ్రఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం 30పడకల ఆసుపత్రికి సరిపడా సిబ్బందిని మాత్రమే కేటాయించడంతో సమస్య నెలకొంది.

వికోట ప్రభుత్వాసుపత్రి

పలమనేరు, కుప్పం ఏరియా ఆసుపత్రులు తీసుకుంటే సుమారు 5 నుంచి 6 మంది ఫార్మసిస్టులు విధుల్లో ఉన్నారు. వి.కోట ఆస్పత్రిని 100 పడకల ఆసుపత్రిగా స్థాయి పెంచుతున్నట్లు అధికారులు, పాలకులు ప్రకటిస్తున్నా... కార్యరూపం దాల్చిన దాఖలాలు లేవు. దీంతో జిల్లా కేంద్రం నుంచి ఆసుపత్రికి రావాల్సిన మందులు, సూదులు సైతం తక్కువ మొత్తంలో వస్తున్నాయి. రోగులు మాత్రం అధికసంఖ్యలో వస్తున్నారు. మందులు, ఇంజక్షన్లకు కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఆస్పత్రిని పలుమార్లు జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు సందర్శించి సమస్యలపై ఆరా తీశారు. మౌలిక సదుపాయాలు కల్పించారు. సొంత మండలానికి చెందిన జిల్లా పరిషత్ చైర్మన్, శాసనసభ్యులు వెంకటే గౌడ ఇద్దరు నాయకులు అనుకుంటే 100పడకల ఆసుపత్రిగా ఉన్నతీకరించే అవకాశం ఉంది. వంద పడకల ఆసుపత్రి వస్తే ప్రస్తుతం ఉన్న 8 మంది వైద్యులకు అదనంగా మరో 6 మంది వైద్యులు అందుబాటులోకి వస్తారు. ఎముకల డాక్టరు, చర్మవ్యాధి, కంటి వైద్యులు, రేడియాలజీ, ఈఎన్‌టి తదితర నిపుణులను కేటాయిస్తారు. గర్భిణీలు, ఎముకలు విరిగిన బాధితులకు ఉచితంగా స్కానింగ్ అందుబాటులోకి వస్తుంది. ప్రస్తుతం ఉన్న 6 మంది వైద్యశాల సేవకులు, సహాయకులు, సిబ్బంది సంఖ్య 21మందికి పెరుగుతుంది. పరిపాలన అధికారి, పర్యవేక్షణ అధికారి సీనియర్ అసిస్టెంట్ 2, జూనియర్ అసిస్టెంట్ 3 ఫార్మసిస్టులు 6 మంది, సెక్యూరిటీ సిబ్బంది 9మంది పూర్తిస్థాయిలో ఉంటారు. స్త్రీలకు, పురుషులకు ప్రత్యేక వార్డులు ఏర్పడతాయి. వారి ఆరోగ్యంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టేందుకు అవకాశం కలుగుతుంది. ప్రతి రోగిని సమగ్రంగా పరీక్షించి వ్యాధులు నయం చేసేందుకు దోహదపడుతుంది.

పెద్దపెద్ద శస్త్ర చికిత్సలు సైతం ఇక్కడే అందుబాటులోకి వస్తాయి. ప్రైవేట్ ఆసుపత్రులను తలదన్నేలా సౌకర్యాలు వనగురుతాయి. పేదలు ప్రైవేట్ ఆసుపత్రుల దోపిడీ నుండి బయటకు పడతారు. ఆరోగ్యశ్రీ పథకం కింద అన్ని చికిత్సలు పేదలకు అందుబాటులోకి వస్తాయి. రెండు జాతీయ రహదారులలో ప్రతిరోజు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. క్షతగాత్రులను ఆగమేఘాలపై 30 కిలోమీటర్లు ప్రయాణించి కుప్పం పిఇఎస్ ఆసుపత్రికి చేర్చాల్సి ఉంది. ఆ భారం కూడా తగ్గిపోతుంది. ప్రజల ప్రాణాలను కాపాడే అవకాశం దొరుకుతుంది. ప్రజలు ఆర్థిక కష్టాల నుండి బయటపడతారు.రోగులకు పాట్లు తప్పుతాయి. అత్యవసర చికిత్సలకు సైతం ఇటు కుప్పం అటు కోలార్ మెడికల్ కళాశాలలకు వ్యయ ప్రయాసలకు ఓర్చి పోవాల్సిన దుస్థితి తప్పుతుంది. వీకోట పట్టణ ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా మార్చి తగిన వసతులు, వైద్యులను కేటాయించి వైద్యసేవలు ప్రజలందరికీ అందుబాటులోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఆ దిశగా పాలకులు దృష్టి పెడతారా.. మాటల మూటలతో మభ్యపెడతారా వేచి చూడాలి.

రోగులతో కిటకిటలాడుతున్న ప్రభుత్వ ఆసుపత్రి



వంద పడకల ఆసుపత్రి విషయంపై హెల్త్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వర్లుతో చర్చిస్తున్న జడ్పీ చైర్మన్

## ఎన్నికల విధులు సక్రమంగా నిర్వహించాలి

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** గతంలో ఎన్నిసార్లు ఎన్నికల విధులు నిర్వహించిన, ఎన్నికల విధులు కొత్తగా ఉంటుందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్.షన్మోహన్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశపు మందిరంలో జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, డిఆర్‌ఓ బి.పుల్లయ్య, డ్వామా పిడి ఎన్.రాజశేఖర్‌లతో కలసి 2024 సాధారణ ఎన్నికలకు సంబంధించిన అంశాలపై ఈ ఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, మున్సిపల్ కమిషనర్లు, నోడల్ ఆఫీసర్లు, ఎంపిడిఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కడప, కర్నూలు, అనంతపురం, నెల్లూరు, నంద్యాల జిల్లా నుండి వచ్చిన ఆర్డీఓలు, తహశీల్దార్లు, ఎంపిడిఓలు గతంలో ఎన్నిసార్లు ఎన్నికల విధులు నిర్వహించిన ఎన్నికల విధులు కొత్తగా ఉంటుందని, ఎన్నికల విధులలో ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా భాధ్యతగా ఎన్నికల విధులను నిర్వహించాలన్నారు. 18, 19, 20, 21 సంవత్సరాల యువత కొత్తగా ఫారం 6 ద్వారా ఓటర్ నమోదుకు ఇచ్చినప్పుడు ఫారం 6తో పాటుగా ఆధార్ కార్డు, స్కూల్ సర్టిఫికెట్, బర్త్ సర్టిఫికేట్‌ను తీసుకోవాలన్నారు. ఫారం 7 తీసివేయడం, మైగ్రేషన్ తీసుకోరాదని, మరణించి వాటికి సంబంధించిన వాటిని మాత్రమే తీసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో ఉన్న డెత్ సర్టిఫికేట్ల పరిశీలించాలన్నారు. న్యూస్ పేపర్లలో వచ్చిన వాటికి సంబంధించి పూర్తి వివరాలను సంబంధిత ఏఈఆర్వోల నుండి తెప్పించుకోవాలని, రాజకీయపార్టీ నాయకులు అందజేసే ఫిర్యాదులను ఎలక్షన్ సెల్ డిప్యూటీ కలెక్టర్ తీసుకొని పరిశీలించాలన్నారు. ప్రతివారం ఏఈఆర్‌ఓలు ఆ వారంలో 6,7,8 ఫారములకు సంబంధించి రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించి వారికి తెలియజేయాలన్నారు. ఈఆర్‌ఓలు అందరు వారికి సంబంధించిన నియోజకవర్గం పరిధిలో రూట్లు ఒక్కసారి పరిశీలించుకోవాలని సూచించారు. ఏఈఆర్‌ఓలు ప్రతి మండల పరిధిలోని పోలింగ్ కేంద్రాలు వాటికి సంబందించిన రూట్లలో పోలింగ్ కేంద్రాలలో గల సౌకర్యాలను పరిశీలించి రిపోర్టును అందజేయాలని ఏఈఆర్‌ఓలను ఆదేశించారు. జిల్లాలోని ఎంఈఓల అందరితో సమావేశం నిర్వహించి వారి పరిధిలోని పోలింగ్ కేంద్రాలలో ఏమైనా పనులు పెండింగ్‌లో ఉంటే దానికి సంబంధించి నిధులు మంజూరు చేసి ఫిబ్రవరి 21కల్లా పనులు పూర్తి చేసి రిపోర్టును పంపించాలని ఎంపిడిఓలను ఆదేశించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో తాగునీరు, విద్యుత్తు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు ఇప్పటికే ఏర్పాటు చేయడం జరిగిందని ఇంకా ఎక్కడైనా మిగిలిపోయి ఉంటే వాటిని కూడా త్వరగా పూర్తి చేయాలని, పోలింగ్ కేంద్రాలలో నెట్వర్క్ సమస్యలుంటే వాటిని పరిశీలించాలని అక్కడ ఏ నెట్వర్క్ పనిచేస్తుందో వంటి వివరాలను అందజేయాలన్నారు. ఈఆర్‌ఓలు అందరూ వారి పరిధిలో ఉన్న స్ట్రాంగ్ రూములను పరిశీలించాలని, ఏమైనా సమస్యలు ఉంటే వాటికి సంబంధించిన వివరాలను పంపించాలన్నారు. ఏఈఆర్వోలు ఆర్వోలు ప్రతి ఒక్కరు ఎన్నికలకు సంబంధించి హ్యాండ్ బుక్‌ను పూర్తిగా చదువుకొని అవగాహన పెంచుకోవాలన్నారు. జిల్లాలో ప్రతి మండలంలో కోఆర్డినేషన్ టీం ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ కోఆర్డినేషన్ టీం సమర్థవంతంగా విధులు నిర్వర్తించేలా చూడాలన్నారు. ప్రతి మండలంలో ఒక ఆదర్శ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు సంబంధించి ఆర్‌ఓలు, ఈఆర్‌ఓలు, ఏఈఆర్వోలు, నోడల్ ఆఫీసర్స్, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

## రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి

డీఆర్‌ఓగా బాధ్యతలు స్వీకరించిన బి.పుల్లయ్య

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:** రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని డీఆర్‌ఓ బి.పుల్లయ్య తెలిపారు.బుధవారం కలెక్టరేట్‌లో నూతన డీఆర్‌ఓగా బి. పుల్లయ్య బాధ్యతలు స్వీకరించారు. పదవీ బాధ్యతలు స్వీకరించక మునుపు జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్, జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులును డిఆర్‌ఓ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. డిఆర్‌ఓ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాలను ఎప్పటికప్పుడు పాటిస్తానని తెలిపారు. బదిలీపై చిత్తూరు జిల్లాకు రావడం ఆనందంగా ఉందన్నారు. క్షేత్రస్థాయి సమస్యలను వీలైనంతవరకు పరిష్కారం చేయడానికి కృషి చేస్తానని, ప్రజలకు అందుబాటులోఉంటానన్నారు. డిఆర్‌ఓగా పనిచేసిన ఎన్.రాజశేఖర్ నూతన డిఆర్‌ఓ పుల్లయ్యకు బాధ్యతలు అప్పజెప్పారు. కలెక్టరేట్ ఏఓ వెంకటేశ్వర్లు, కలెక్టరేట్‌లోని వివిధ సెక్షన్‌ల సూపరింటెండెంట్లు, సిబ్బంది నూతన డిఆర్‌ఓకు పుష్పగుచ్ఛం అందజేశారు.

## 15న రీజినల్ జాబ్ మేళా

జాబ్ మేళా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:** రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఈనెల 15న గురువారం స్థానిక విజ్ఞానసుధ డిగ్రీ కాలేజ్‌లో నిర్వహించే రీజినల్ జాబ్ మేళాను ఉద్యోగ అర్హత కలిగిన యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ తెలిపారు. బుధవారం కలెక్టర్ రీజినల్ జాబ్‌మేళాకు సంబందించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. రీజినల్ జాబ్‌మేళాను జిల్లాలోని అన్ని పంచాయతీ, వార్డు సచివాలయాలోని పరిధిలో ఉద్యోగ అర్హత కలిగిన వారికీ సమాచారం చేరవేయాలని కోరారు. అదేవిధంగా ఇందులో దాదాపు 100 కంపెనీలు పైగా విచ్చేయు చున్నాయని, కనీస విద్యార్హత 10వ తరగతి నుండి పీజీ ఫెయిల్/ పాస్ అయిన 18 నుండి 35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన స్త్రీ, పురుష అభ్యర్థులు హాజరు కావచ్చునని తెలిపారు. కార్యక్రమంలో రీజినల్ స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ ఎన్. శ్యాంమోహన్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎన్.గుణశేఖర్ రెడ్డి, జిల్లా వ్యవసాయాశాఖ అధికారి మురళికృష్ణ, అదనపు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.ఏకాంబరం రెడ్డి, జిల్లా ప్లేసేమెంట్ అధికారి చైతన్య పాల్గొన్నారు.

## రామచంద్ర యాదవ్, అనుచరులపై కేసు నమోదు

**ప్రజాశక్తి-పుంగనూరు:** బీసీవై పార్టీ అధినేత రామచంద్రయాదవ్, అతని అనుచరులపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. 2024 జరగబోవు సాధారణ ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు గోడ గడియారాలు తెప్పించినట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించారు. గోడ గడియారాలతో పాటు అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్నారని కేసులు నమోదు చేశారు. ఎల్‌ఐసి కాలనీ రామచంద్రయాదవ్ సెక్యూరిటీ గార్డు ఇంటిలో సోదాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎల్‌ఐసి కాలేజీలోని వెంకట్‌రెడ్డి ఇంటిలో 4059 గోడ గడియారాలు, దీంతో పాటు 489 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించి అర్బన్ సిఐ రాఘవరెడ్డి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని తిమ్మికృష్ణాపురం గ్రామంలో టి.శ్రీనివాసులు యాదవ్ కుమారుడు టి.శివకుమార్‌యాదవ్ ఇంటిలో కూడా అక్రమంగా 5995 గోడ గడియారాలు, 489 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు ఉన్నట్టు గుర్తించి రూరల్ సీఐ కృష్ణారెడ్డి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

**రాజకీయ వేధింపుల్లో భాగమే..**

తమపై అక్రముల కేసులు నమోదు చేయడం రాజకీయ వేధింపుల్లో భాగమేనని బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్రాయాదవ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పుంగనూరు నియోజకవర్గంలో ప్రజాస్వామ్యం లేదని, అక్కడ నడుస్తున్నది పెద్దిరెడ్డి రాజ్యాంగం మాత్రమే అని పేర్కొన్నారు. గోడ గడియారాలు మాత్రమే మా పార్టీ తరపున ఎన్నికల షెడ్యూల్ రాకముందే ఇచ్చేందుకు తెప్పించమన్నారు. పోలీసులు అనవసర రాద్ధాంతం చేస్తూ సోదాలు నిర్వహించడం ప్రజల్లో మాపై లేని పోని ఆరోపణలు చేయడం వంటివి చేస్తున్నారన్నారు. చట్టాలు అమలు చేయాల్సిన వారే ప్రజాస్వామ్య విధానాన్ని వదిలి వైసిపి కండువాలు కప్పుకుని ఆ పార్టీకి పనిచేస్తున్నారని మండిపడ్డారు. త్వరలో జరగబోవు అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు తప్పక బుద్ధి చెబుతారని పేర్కొన్నారు.

## 'ద్రావిడ' సమీప అడవిలో చెలరేగిన మంటలు

**ప్రజాశక్తి-చిత్తూరు డెస్క్:** ద్రావిడ వర్సిటీ ఏమిగో బిల్డింగ్ సమీపంలో బుధవారం మధ్యాహ్నం మంటలు చెలరేగాయి. అకతాయిలు అగ్గిపెట్టడంతో సరిహద్దు అడవి కావడంతో ఉవ్వెత్తున నిప్పు రవ్వలు రాజుకున్నారు. భారీ ఎత్తున మంటలు చెలరేగాయి. ఎగసి పడుతున్న మంటలను గుర్తించిన ద్రావిడ వర్సిటీ సిబ్బంది అగ్నిమాపక అధికారులు సమాచారం ఇవ్వడంతో అక్కడకు చేరుకున్న ఫైర్ సిబ్బంది అతి కష్టం మీద మంటలను అదుపుచేశారు.

## ఓటరు మార్పు, చేర్పులపై రీసర్వే: కలెక్టర్

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:** ఫారం– 8 ద్వారా వచ్చిన మార్పులు, చేర్పులు, మరణించిన వాటికీ సంబంధించి బిఎల్‌ఓల ద్వారా మళ్ళీ ఒక్కసారి సర్వే చేయించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశం హాల్‌లో డిఆర్‌ఓ ఎన్.రాజశేఖర్‌తో కలసి ఓటర్ జాబితా, ఫారం 6,7 8 ద్వారా వచ్చిన వాటిపై, పోలింగ్ కేంద్రాలకు సంబంధించి గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు ఆర్డీఓలు, తహశీల్దార్లు కొత్త వారు రావడం జరిగిందని, ఫారం–8 ద్వారా వచ్చిన మార్పులు, చేర్పుల తోపాటుగా మరణించిన వాటికీ సంబంధించి బిఎల్‌ఓల ద్వారా మళ్ళీ ఒక్కసారి ఇంటింటికీ వెళ్లి సర్వే చేయించడం జరుగుతుందని తెలిపారు. డబ్బుల్ ఎంట్రీ ఓటర్లు లేరని బిఎల్‌ఓలు లెటర్లు కూడా ఇవ్వడం జరిగిందని తెలిపారు. జిల్లాలో 93 శాతం ఓటర్ కార్డుకు ఆధార్ లింక్ చేయడం జరిగిందన్నారు.

నామినేషన్లు వేసే వరకు ఫారం 6 ద్వారా కొత్త ఓటరుగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. 18 నుండి 22 సంవత్సరాల యువత కొత్తగా ఫారం 6 ద్వారా ఓటర్‌గా నమోదుకు సంబంధించి ఆధార్‌కార్డుతో పాటు స్కూల్ సర్టిఫికేట్‌ను తప్పనిసరిగా అందజేయాలన్నారు. పోలింగ్ బూత్ నుండి వేరే పోలింగ్ బూత్‌కు, నియోజకవర్గం నుండి వేరే నియోజకవర్గానికి మార్పులు చేసుకున్న వాటికి సంబంధించి రిపోర్టును బిఎల్‌ఓలు ఈఆర్‌ఓలకు రిపోర్టును పంపించాలన్నారు. నేటి నుండి జిల్లా కలెక్టరేట్‌లో డిప్యూటీ కలెక్టర్ అధ్యక్షతన ఒక్క టీం పనిచేస్తుందని ఈ టీం అనుమానం ఉన్న 6,7,8 ఫారంలకు సంబంధించి వచ్చిన వాటిని పరిశీలించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందని, ఇంకా ఎక్కడైనా పోలింగ్ కేంద్రాల్లో ఏమైనా సమస్యలు ఉంటే రాజకీయ పార్టీల నాయకులు వాటికి సంబంధించి వివరాలను డీఈఓ, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురావాలని వారికి సూచించారు. సమావేశంలో జిల్లా కలెక్టరేట్ ఎన్నికల విభాగం డిప్యూటీ తహశీల్దార్ త్యాగరాజులు, జూనియర్ సహాయకులు త్యాగరాజులు, కాంగ్రెస్ పార్టీ నుండి డిసిసి అధ్యక్షుడు భాస్కర్, పరదేసి, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి అట్లూరి శ్రీనివాసులు, సిపిఎం జిల్లా కార్యదర్శి వి.గంగరాజు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర సెక్రెటరీ వి.సురేంద్ర కుమార్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి ఎన్.ఉదయ్ కుమార్, బహుజన సమాజపార్టీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ పి.భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

## జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ ఏర్పాటు చేసుకోవాలి

జర్నలిస్టుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** జర్నలిస్ట్‌ల హౌసింగ్ సొసైటీ ఏర్పాటు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ పాత్రికేయులకు సూచించారు. బుధవారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, డిఆర్‌ఓ పుల్లయ్యలతో కలసి జర్నలిస్ట్ హౌసింగ్ కమిటీ జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జర్నలిస్ట్‌ల హౌసింగ్ కొరకు గుర్తించిన భూమిని సర్వే చేసి సరిహద్దు రాళ్లను ఏర్పాటు చేయాలని, జర్నలిస్ట్‌ల హౌసింగ్ సొసైటీ ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. పుంగనూరు, వి.కోటకు సంబంధించి భూమిని త్వరితగతిన గుర్తించాలని పలమనేరు ఆర్‌డిఓను ఆదేశించారు. సమావేశంలో చిత్తూరు, పలమనేరు, కుప్పం ఆర్డీఓలు చిన్నయ్య, మనోజ్ కుమార్ రెడ్డి, శ్రీనివాసులు, డిస్ట్రిక్ట్ ల్యాండ్స్ అండ్ సర్వే అధికారి గౌస్ బాషా, కమిటీ మెంబెర్స్ సహదేవ, జయరాజ్, సయ్యద్ అక్రమ్, డిఐపిఆర్‌ఓబి.పద్మజ, చిత్తూరు గుడిపాల తహశీల్దార్లులు శ్రీనివాసరెడ్డి విజయలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ కిరణ్, చిత్తూరు ప్రెస్ క్లబ్ అధ్యక్షులు, సెక్రెటరీలు లోకనాథం, అశోక్ కుమార్, పాత్రికేయులు పాల్గొన్నారు.

## ఈవీఎంల వినియోగంపై అవగాహన

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్**

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్, కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వారి ఆదేశాల మేరకు స్వీప్ కార్యక్రమాల్లో భాగంగా చిత్తూరు గాంధీ విగ్రహ కూడలిలో భారీ ఈవీఎం నమూనాలు ఏర్పాటు చేశారు. ఏఈఆర్వో, కమిషనర్ డాక్టర్ జె.అరుణ ఆధ్వర్యంలో అధికారుల బృందాలు క్షేత్రస్థాయిలో కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా నగరం మధ్యలో గాంధీ విగ్రహ కూడలిలో ఏర్పాటు చేసిన భారీ ఈవీఎం నమూనా ఆకట్టుకుంటోంది. ఈవీఎంలో ఓటింగ్ విధానం పై ఈ నమూనా ఆధారంగా ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నారు. ఈవీఎంలో ఓటు వేసిన సందర్భంలో ఎవరికి ఓటు వేసామో.. వారి పేరు ఎదురుగా లైట్ వెలిగేలా ఏర్పాట్లు చేశారు. ఈవీఎం పనిచేసే విధానంపై ఓటర్లకు క్రమం తప్పకుండా అవగాహన కల్పిస్తున్నారు.





ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న నగరపాలక సంస్థ అధికారులు

## నగరపాలక స్టాండింగ్ కమిటీ సమావేశం

స్టాండింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న నగర మేయర్

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ :** చిత్తూరు నగరపాలక సంస్థ స్టాండింగ్ కౌన్సిల్ సమావేశం బుధవారం నగరపాలక కార్యాలయంలో నగర మేయర్ ఎస్.అముద అధ్యక్షతన జరిగింది. కమిషనర్ డాక్టర్ జె.అరుణ, స్టాండింగ్ కమిటీ సభ్యులు డిప్యూటీ మేయర్ ఆర్.చంద్రశేఖర్, ఆర్‌జి.శ్రీకాంత్, సహదేవన్ పాల్గొన్నారు. స్టాండింగ్ కమిటీ సమావేశంలో నగరపాలక సంస్థకు సంబంధించిన కూరగాయల మార్కెట్లు, జంతు వధశాల, ఎన్టీఆర్ బస్టాండ్, కాసు బ్రహ్మానందరెడ్డి బస్టాండ్‌లకు సంబంధించి 2024– 25 సంవత్సరానికి బహిరంగ వేలం నిర్వహించుటకు గెజిట్ నోటిఫికేషన్ ప్రకటించడానికి ఆమోదించారు. ఈసమావేశంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంఈ గోమతి, ఎంహెచ్వో డాక్టర్ లోకేష్, ఏసిపీ రామకృష్ణుడు, మేనేజర్ ఉమామహేశ్వర్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఆశయ సాధనకు క్రమశిక్షణ, పట్టుదల సోపానాలు

విజయం జూనియర్ కళాశాల వార్షికోత్సవ సభలో వక్తల సందేశం

వార్షికోత్సవ సభలో మాట్లాడుతున్న విజయం విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:** విద్యార్థి మానసికంగా ఎదగడానికి ఆశాయలను సాధించడానికి, చదువుతో పాటు క్రమశిక్షణ, పట్టుదల అవసరమని, ఇవి కలిగిన ప్రతి విద్యార్థికి మార్కులు, ర్యాంకులతో సంబంధం లేకుండా ఉజ్వలమైన భవిష్యత్తు వుంటుందని శ్రీభానోదయ స్కూల్ కరస్పాండెంట్ ఎం.నాగేశ్వరరావు అన్నారు. బుధవారం జరిగిన విజయం జూనియర్ కళాశాల 15వ వార్షిక వేడుకలలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రతి గురువు నిచ్చెన లాంటి వారేనని ఎంతమంది తనని ఉపయోగించుకొని శిఖరాలను చేరుకున్నా తాను మాత్రం భోదన చేయడంలో అత్యంత ఆనందాన్ని పొందుతాడని అన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న గిరింపేట మునిసిపల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుల రమేష్‌బాబు మాట్లాడుతూ విద్యార్థి దశలో ఇంటర్మీడియట్ అత్యంత కీలకమైన ఎదుగుదల సమయమని, దీనిని సక్రమంగా ఉపయోగించుకొని మంచి భవిష్యత్తుకి మార్గం ఏర్పరుచుకోవడానికి వారు ఎనుకొనే కళాశాల గురువులు అత్యంత ప్రాధాన్యం కలవారని అందుకు విజయం విద్యాసంస్థలు ఒక చక్కటి నెలవుగా ఆయన అభివర్ణించారు. ఏకాగ్రత ఎవరినైనా ఉన్నత శిఖరాలకు చేర్చుతుందన్నారు. కళాశాల అధినేత డాక్టర్ తేజోమూర్తి మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాశం ఒక మనిషిని అనూహ్యమైన విజయాల వైపు పయనించేటట్లు చేస్తుందని మార్కులు, ఉద్యోగాల కంటే పరోక్ష అసులైన వినయవిధేయతలు సంస్కారం జీవితంలో అతి ముఖ్యమని తెలిపారు. ప్రపంచీకరణ నేపథ్యంలో ఉద్యోగాల కల్పన ఎక్కువగా వున్నాయి. ప్రతి విద్యార్థికి అపారమైన ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉన్నదని, నైపుణ్యం పెంచుకొంటూ అవకాశాలని అందిపుచ్చుకోవాలన్నారు. తరువాత ప్రసంగించిన కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ శైలజామూర్తి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి అకుంఠితమైన దీక్ష పట్టుదల వుంటే సాధించలేనిది ఏదీ ఉండదని అన్నారు. కళాశాల ప్రిన్సిపల్ ఎం.జీవరత్నం నాయుడు సభకు వార్షిక నివేదికను సమర్పించారు. కార్యక్రమం చివరలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతలను అలరించాయి.

# కొత్త సార్లొచ్చారు..!

పలమనేరు: డీఎస్పీ మహేశ్వరరెడ్డి

శాంతిపురం: తహశీల్దార్ మురళీకృష్ణ

గంగాధర నెల్లూరు: తహశీల్దార్ రవి

గంగాధర నెల్లూరు: ఎంపీడీవో భాస్కర్

బంగారుపాళ్యం: బాధ్యతలు చేపడుతున్న ఎస్ఐ

**ప్రజాశక్తి-పలమనేరు:** పలమనేరు డీఎస్పీగా బుధవారం మహేశ్వరరెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న డీఎస్పీ సుధాకర్‌రెడ్డి బదిలీపై వెళ్లారు. నూతన డీఎస్పీ మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో కఠినంగా ఉంటానన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిపై చర్యలు కఠినంగా తీసుకుంటానన్నారు.

**శాంతిపురం:** మండల తహశీల్దార్‌గా బుధవారం మురళీకృష్ణ బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఈయన శాంతిపురం తహశీల్దార్‌గా నియమితులైయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై దృష్టి సారిస్తానని త్వరితన పరిష్కారానికి చొరవ తీసుకుంటానన్నారు.

**గంగాధర నెల్లూరు:** జీడీ నెల్లూరు తహశీల్దార్‌గా రవి బుధవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం తహసిల్దార్‌గా పనిచేస్తున్న బదిలీపై ఇక్కడకు వచ్చారు. అదేవిధంగా మండల ఎంపీడీవోగా భాస్కర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన నెల్లూరు జిల్లా ఏఎస్ పేట ఎంపీడీవోగా పనిచేస్తూ బదిలీపై వచ్చారు. పలువురు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం తెలిపారు.

**బంగారుపాళ్యం:** నూతన ఎస్ఐగా మల్లికార్జున బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు చిత్తూరు వన్ టౌన్ ఎస్ఐగా విధులు చేపడుతూ బదిలీపై బంగారుపాళ్యంకి వచ్చారు. ఆయన మాట్లాడుతూ శాంతి భద్రత పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

## 'రైతులు ఓటు వివరాలు అందజేయండి'

**ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు:** జీడీ నెల్లూరు సింగల్ విండో సొసైటీలో కొత్త ఓటర్ కార్డు అందజేయడానికి సొసైటీలో ఓటు హక్కు కలిగిన రైతులందరూ వారి వివరాలకు సంబంధించి జిరాక్సును అందజేయాలని త్రిమెన్ కమిటీ చైర్మన్ వేల్కూరు బాబు రెడ్డి, సీఈఓ విజయ్ కుమార్ రెడ్డి, సీనియర్ ఇన్స్పెక్టర్ ఆడిటర్ బాబు, అసిస్టెంట్ రిజిస్టర్ ప్రసాద్, సూపర్వైజర్ విజయ బుధవారం ఓ ప్రకటనలో కోరారు. సొసైటీలో ఓటు హక్కు కలిగిన రైతులు, సభ్యులు అందరూ ఆధార్ కార్డు, రెండు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు, పట్టాదారు పాసుపుస్తకం, లేదంటే 1-బి అడంగల్ కాపీ జిరాక్సును ఈనెల 12వ తేదీ లోపు సింగిల్ విండో ఆఫీసులో చేర్చాలన్నారు.

## పౌష్టికాహారం కిట్లు పంపిణీ

**ప్రజాశక్తి-చిత్తూరు డెస్క్:** టీబీ రోగులకు పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా పంపిణీ చేయాలని జిల్లా ఇమ్మ్యునైజేషన్ అధికారి డాక్టర్ రవిరాజు ఆదేశించారు. బుధవారం నగరి, బుగ్గ అగ్రహారం, విజయపురం, నింద్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద ప్రధానమంత్రి టీబీ విముక్త్ భారత్ అభియాన్ పథకం కింద టీబీ రోగులకు పౌష్ఠికాహారం కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీ వ్యాధితో బాధపడుతున్నవారు చల్లటి నీరు తాగరాదని, చల్లటి వాతావరణంలో ఉండరాదని సూచించారు. తీరని దగ్గు ఉంటే తప్పని సరిగా పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## రుచికర భోజనం వడ్డించాలి: ఎంఈఓ

**ప్రజాశక్తి-బంగారుపాళ్యం:** విద్యార్థులకు రుచికరమైన భోజనము వడ్డించాలని ఎంఈవో నాగేశ్వరరావు అన్నారు. బుధవారం మండలంలోని గుండ్ల కట్టమంచి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారమే భోజనం వడ్డించాలని, విద్యార్థిలకు చిక్కి పౌష్టికాహారంలో కోడిగుడ్డు తప్పనిసరిగా అందించాలన్నారు. అనంతరం భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్ర మంలో ఎంఈఓ-2 రమేష్, హెచ్ఎం బెరీనాథ్, ఉపాధ్యా యులు సురేష్, మధ్యాహ్న భోజన నిర్వహకులు పాల్గొన్నారు.

## ఘనంగా గాలి ముద్దుకృష్ణమనాయుడు వర్ధంతి

**ప్రజాశక్తి-చిత్తూరు డెస్క్:** దివంగత మంత్రి గాలి ముద్దుకృష్ణమనాయుడు 6వ వర్ధంతిని ఆయన కుమారుడు, నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నగరి బస్టాండ్ దగ్గర ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ముద్దుకృష్ణమనాయుడు చిత్ర పటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

## 'ఆత్మీయ సమావేశాన్ని జయప్రదం చేయండి'

**ప్రజాశక్తి-రామకుప్పం:** టీడీపీ ఆధ్వర్యంలో అఖిల గాండ్ల తెలికుల ఆత్మీయ సమావేశాన్ని జయప్రదం చేయాలని కుప్పం మాజీ జెడ్పిటిసి చౌడప్ప కోరారు. బుధవారం టిడిపి పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈనెల 11న కుప్పం మున్సిపాలిటీ కమతమూరు దండు మారెమ్మ ఆలయ ఆవరణలో సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. రానున్న ఎన్నికల అనంతరం ప్రభుత్వం ద్వారా స్థల సేకరణ, కమ్యూనిటీ భవనం, కుల వృత్తుల వారికి బ్యాంకుల ద్వారా సబ్సిడీతో ఆర్థిక సాయం, విద్య ,ఉద్యోగం, నిరుపేదలకు పెళ్లిళ్లు జరిపించడం తదితర కుల అభివృద్ధికి సహకరించేందుకు ప్రతి ఒక్కరు కార్యక్రమానికి హాజరుకావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఉపేంద్ర, సత్యనారాయణ, సుబ్రహ్మణ్యం, మహమ్మద్ రఫీ, వెంకటరమణ, మురళి, వెంకట్రామ పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం అందజేత

**ప్రజాశక్తి-చిత్తూరు డెస్క్:** నగరి మున్సిపల్ పరిధి సత్రవాడ దళితవాడలో గత ఏడాది డిసెంబరు నెలలో వచ్చిన తుఫాను ప్రభావంతో కొండపై నుంచి బండ జారిపడి ఇంటిగోడ శిధిలమైన బాధితురాలు సుబ్బమ్మకు ప్రభుత్వం నుంచి రూ.15వేలు ఆర్థిక సాయం అందింది. బుధవారం మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం బాధితురాలి ఇంటివద్దకు వెళ్లి ఆర్థిక సాయాన్ని అందించారు. కార్యక్రమంలో నాయకులు బాలన్, బాలకృష్ణ, అయ్యప్పన్, భూపాలన్, ఇళంగో పాల్గొన్నారు.

'నులి పురుగుల నివారణ

## దినోత్సవాన్ని విజయవంతం చేయండి'

**ప్రజాశక్తి-సోమల:** జాతీయ నులి పురుగుల దినోత్సవాన్ని విజయవంతం చేద్దామని ఎంఈవో శివరత్నమ్మ పిలుపునిచ్చారు. బుధవారం ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని పాఠశాలల్లోని విద్యార్థులకు ఈనెల 9న ఆల్ బెండజోల్ మాత్రలను అందజేసి వారి చేత మాత్రలను మింగించాలని సిబ్బందిని సూచించారు.

## 'గ్రామాభివృద్ధి టీడీపీతోనే సాధ్యం'

**ప్రజాశక్తి-రామకుప్పం:** టీడీపీ ప్రభుత్వంలోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కొంగనపల్లి గ్రామపంచాయతీలో గ్రామ వికాస కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలనకు అంతిమ ఘడియలు దగ్గర పడ్డాయన్నారు. ఒక్క ఛాన్స్ పేరుతో అధికారాన్ని చేజించుకున్న సీఎం జగన్ జనం గోడును గాలికి వదిలేసారున్నారు. గ్రామాల్లో అభివృద్ధి జరగడం లేదని అరా చకశక్తులు పెరిగిపో తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు నరసింహులు, చలపతి, చిన్నకృష్ణ, రమేష్ బాబు, వెంకటాచలం, రామలింగారెడ్డి, మహమ్మద్ రఫీ, వెంకటరమణ పాల్గొన్నారు.

## విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ

**ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ:** బుచ్చినాయుడు కండ్రిగ మండలం నెలవాయి గ్రామంలోని జడ్పీ హైస్కూలు ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడా సామగ్రిని రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ అంబూరు సుబ్రహ్మణ్యం బుధవారం అందించారు. పాఠశాలలోని విద్యార్థుల సామర్థ్యాన్ని బట్టి రిటైర్డ్ ప్రొఫెసర్ సుబ్రహ్మణ్యం విద్యార్థులకు సేవ చేయాలని దృఢ సంకల్పంతో జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల ఉపాధ్యాయులు కోరిన వెంటనే క్రీడా సామగ్రిని అందించిన వరదయ్య పాలెం మండలం అంబూరుకి చెందిన డాక్టర్ అంబురు సుబ్రహ్మణ్యం ను. పల్లమాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

## 'అర్చకులు ఆరోగ్య నియమాలపై అవగాహన పెంచుకోవాలి'

**ప్రజాశక్తి - క్యాంపస్ :** అర్చకులు ఆరోగ్య నియమాలపై అవగాహన పెంచుకోవాలని ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణులు డాక్టర్ పి.మురళీకృష్ణ కోరారు. టీటీడీ ఆలయాల్లో పనిచేస్తున్న అర్చకులకు శ్రీ వేంకటేశ్వర ఉద్యోగుల శిక్షణ సంస్థ(శ్వేత) ఆధ్వర్యంలో తిరుపతిలోని ఎస్వీ వేద విశ్వవిద్యాలయంలో జరుగుతున్న పునశ్చరణ తరగతులు బుధవారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా డాక్టర్ పి.మురళీకృష్ణ "మన ఆరోగ్యం మన చేతుల్లోనే" అనే అంశంపై మాట్లాడుతూ వైద్యశాస్త్రంలో వ్యాయామానికి అధిక ప్రాధాన్యత ఉందన్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు వ్యాయామం, యోగా, ధ్యానం చేయాలన్నారు. మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగేందుకు యోగా ఉపకరిస్తుందన్నారు. అర్చకులు చేసే అనుష్టాన ప్రక్రియ ప్రాణాయామంలో ఒక భాగమేనన్నారు.

## పోలింగ్ బూత్‌ల పరిశీలన

**ప్రజాశక్తి -కోట :** మండల పరిధిలోని కోట బాలికల హైస్కూల్, తిమ్మనాయుడుపాలెం, వెంకన్నపాలెం,తిన్నెలపూడి, లక్ష్మక్క కండ్రిగ, తదితర గ్రామాల్లోని పోలింగ్ బూత్ లను కోట తహశీల్దారు డి.నాగరాజరావు బుధవారం క్షుణ్ణంగా పరిశీలించారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పనపై స్థానిక ఉపాధ్యాయులను ఆరా తీశారు. తహశీల్దారు బి నాగరాజు మాట్లాడుతూ రామన్న ఎన్నికలకు పోలింగ్ బూత్‌లు సక్రమంగా ఉన్నాయా? లేదా అని పరిశీలిస్తున్నామన్నారు. అన్ని పోలింగ్ బూత్‌లలో సౌకర్యవంతమైన వసతులు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు మల్లికార్జునరావు, ఆర్ ఐ ప్రశాంత్, ఉపాధ్యాయులు ఉన్నారు పాల్గొన్నారు.

## పోస్టల్ సిబ్బందికి శిక్షణ తరగతులు

**ప్రజాశక్తి - గూడూరు టౌన్ :** మారుతున్న కాలానికి అనుగుణంగా తపాలా శాఖ ప్రజలకు చేరువవటం లో ఎప్పటికప్పుడు తమవంతు ప్రయత్నం చేస్తోందని గూడూరు పోస్టల్ డివిజనల్ సూపరింటెండెంట్ ఎస్-ఎస్‌విఎకె కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా విధుల్లో చేరిన బ్రాంచి పోస్ట్ మాస్టర్ లు అందరికీ శిక్షణా తరగతులు గూడూరు పట్టణం పరిధి లోని మాలవ్యానగర్ ఉప తపాలా కార్యాలయం ఆవరణలో నిర్వహించారు. ఈ కార్యక్రమం లో మాలవ్యనగర్ సబ్ పోస్ట్ మాస్టర్ కె.సాల్మన్ , ఎల్. సురేశ్ పాల్గొన్నారు.

## లెప్రసిపై అవగాహన

**ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ:** మండల కేంద్రంలోని పుత్తేరి గ్రామపంచాయతీలోనీ తెరిపాడు గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి డాక్టర్ దివాకర్ ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ న్యూక్లియర్ టిం డాక్టర్ రాజు, డీపీఎంవో జోబు బుధవారం కుష్టు వ్యాధి పై అవగాహన కల్పించారు. పరీక్షలు నిర్వహించిన వెంటనే కుష్టు నిర్ధారణ అయితే తగిన మందులను ఆరు నెలల మందులు ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తామన్నారు. శరీర భాగంలో ఎక్కడైనా మచ్చలు ఉంటే, ఈ మచ్చలు ద్వారా స్పర్శ, నవ, నొప్పి, లాంటివి ఉండవని ఈ సందర్భంగా తెలిపారు. ఈ వ్యాధి పట్ల జాగ్రత్త వహించాలని పంచాయతీలను ప్రజలకు తెలిపారు.

## టీటీడీ విద్యార్థులు పోటీ పరీక్షల్లో రాణించాలి : జెఈవో

**ప్రజాశక్తి - క్యాంపస్ :** టీటీడీ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులు పోటీ పరీక్షల్లో రాణించాలని జెఈవో సదా భార్గవి కోరారు. శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల 31వ వార్షికోత్సవం ప్రిన్సిపాల్ డా. సి.భువనేశ్వరి అధ్యక్షతన బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జెఈవో సదా భార్గవి ముందుగా విద్యార్థినుల తల్లిదండ్రుల సౌకర్యార్థం నిర్మించిన ధాత్రి సదన్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో జెఈవో, విశిష్ట అతిథి, టీటీడీ న్యాయాధికారి వై.వీర్రాజు, గౌరవ అతిథి టీటీడీ డీఈవో డా. ఎం.భాస్కర్ రెడ్డి, విశ్రాంత తెలుగు అధ్యాపకులు డాక్టర్ ప్రేమావతి, డా.మీనా కుమారి, హాస్టల్ వార్డెన్లు, అధ్యాపకులు, అధ్యాపకేతర బృందం, ఎన్ సి సి, ఎన్ఎస్ఎస్ విద్యార్థినులు పాల్గొన్నారు.

## పులివర్తి వినీల్ ఇంటింటి ప్రచారం

**ప్రజాశక్తి రామచంద్రాపురం:** నవ్యాంధ్రప్రదేశ్ బంగారు భవిష్యత్తు కోసం టిడిపికి పట్టం కట్టాలని ఆ పార్టీ చంద్రగిరి నియోజకవర్గ యువనేత పులివర్తి వినిల్ పిలుపు నిచ్చారు. బుధవారం మండలంలోని కొత్త కండ్రిగ, పంచాయతీలోని క్రిష్ణగిరి కాలనీ, అని చెరువు, తాటితోపు కండ్రిగ, యాగప్ప రెడ్డి కండ్రిగ గ్రామాలలో బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పులివర్తి వినిల్ కి స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు గజ పూలమాలతో ఘనస్వాగతం పలికారు. టిడిపి మ్యానిఫెస్టో కరపత్రాలను ఇంటింటికి అందజేసి టిడిపి చేపట్టబోయే సంక్షేమ పథకాలను వినీల్ ప్రజలకు వివరించారు. గ్రామాలలో మహిళలు కర్పూర హారతులతో వినీల్ కి ఇంటింటా నీరాజనాలు పలికారు.

# దేనికి సిద్ధమయ్యా...మీరంతా!

శాంతిపురంలో పోటాపోటీగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

**ప్రజాశక్తి-తిరుపతి:** "పచ్చని పల్లెటూర్లు.. కాయాకష్టం చేసుకొని జీవించే బతుకులు.. ఉపాధి కోసం ఎల్లలు దాటి వెళుతున్నాం.. అన్నదమ్ముల వలె కలిసిమెలసి ఉంటున్నాం.. సిద్ధం.. మేమూ సిద్ధమంటూ ఎవరిని కవ్వించడానికి ఇలా చేస్తున్నారో.. ఎన్నికలొస్తే చాలు ఒహో ఆహా అంటూ వచ్చేస్తారు.. ఊర్లో ఏనుగులొచ్చి పంటలు ధ్వంసం చేస్తుంటే ఒక్కరు రాలా.. నీటి సమస్య ఉందని అడిగితే ఒక్కరూ పట్టించుకోలా.. ఉద్యోగాలిప్పించండయ్యా అంటే చూద్దాంలే అంటూ మాట దాటేశారు.." ప్రశాంతంగా ఉన్న ఊళ్లలో రాజకీయ వైరాలు రేపెట్టేందు కొత్త పంథాలో నేతలు రావడం ఏంటని సామాన్య ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. దేనికి సిద్ధమయ్యా... మీరు అంటూ ఏర్పాటు చూసిన ఫ్లెక్సీలను చూసి ఒకింత మండిపాటుకు గురవుతున్నారు. పోటాపోటీ ఫ్లెక్సీలతో వివాదాలు తలెత్తే అవకాశం ఉందని, వెంటనే ఇలాంటి చర్యలు మానుకోవాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## అదిగో గొయ్యి.. వాహనం అదుపు చెయ్యి

- రహదారిపై ఏర్పడ పెద్ద గుంత
- పట్టించుకోని అధికారులు

**ప్రజాశక్తి-బంగారుపాళ్యం:** బంగారుపాళ్యం నుంచి అరగొండకు వెళ్లే మార్గంలో కరిడివారిపల్లి సమీపంలో రహదారిపై పెద్ద గుంత ఏర్పడింది. సరిగ్గా బ్రిడ్జి వద్ద గుంత ఏర్పడింది. దీంతో అటుగా వెళ్లే వాహనదారులు అకస్మాత్తుగా గుంత కనిపించడంతో తప్పించే క్రమంలో ఒకింత కుదుపునకు గురవుతున్నారు. వరుసగా ద్విచక్ర వాహనాలు అక్కడికి చేరుకోగానే ఒక్క సారిగా గొయ్యిని చూసి ఆందోళనతో అటుఇటు బండిని తిప్పేస్తున్నారు. ప్రమాదం జరిగే అవకాశాలు ఉందని తెలిసినా అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇకనైన అధికారులు చొరవ తీసుకొని గొయ్యిని పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

## గణితంలో పిల్లల ధారణ అమోఘం: ఎంఈవో

**ప్రజాశక్తి-బంగారుపాళ్యం:** గణితంలో పిల్లల ధారణ అమోఘమని మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు అన్నారు. బుధవారం మండలంలోని గుండ్లకట్టమంచి జెడ్పీ ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక, ఆంధ్రప్రదేశ్ మ్యాథ్స్ ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో గణిత ప్రజ్ఞాధారణ 16వ కార్యక్రమము హెచ్ఎం భేరినాథ్ ఆధ్వర్యంలో జరిగినది. ఎంఈఓ నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లల ధారణ అమోఘ మని వారు సంఖ్యలతో చేసే గారడి కార్యక్రమాన్ని మొట్టమొదటిసారిగా చూస్తున్నానని వారి ప్రతిభను కొనియాడారు. ఈ కార్యక్రమం ఓ అద్భుతం ఇలాంటి కార్యక్రమాలను చూడటం ఒక వరం. వీరి ప్రతిభకు గుర్తింపు తీసుకురావలన్నారు. అంతకు ముందు ఆంధ్రప్రదేశ్ మాథ్స్ ఫోరమ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు గణిత అవధాని హెచ్.అరుణ, శివప్రసాద్ తన శిష్య బృందం లహరి, హేమ, పునీత్ సాయి, రేవతిలచే గణిత ప్రజ్ఞాధారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రేక్షకులు చెప్పిన 100 రెండు అంకెల సంఖ్యలను బోర్డుపై రాశారు. విద్యార్థులు వీటిని ఒక్కసారి విని మొదటి నుండి చివరకు చివరి నుండి మొదటికి చెప్పడమే కాక ఆ సంఖ్యల స్థానాలను తెలియజేశారు. ఈ 200 అంకెల సంఖ్యలను ఐదుతో గుణించి లబ్దాన్ని విద్యార్థులతో చెప్పించారు. కంప్యూటర్లలో సైతం సమాదానం చేయించలేమని తెలిపారు. భారతదేశంలో మొట్ట మొదటిసారిగా మా పాఠశాల విద్యార్థులు ఇన్ని సంఖ్యలు చెబుతున్నారని ఇది మన జిల్లాకే గర్వకారణం అని తెలిపారు. ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో పుట్టిన విద్యార్థుల ప్రతిభ అమోఘమని వీరి ప్రతిభకు గుర్తింపు తీసుకొని రావడానికి తన వంతు సహాయం చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 రమేష్, ఎన్ఆర్ఐ కృష్ణమూర్తి, గణిత ఉపాధ్యాయులు శివరామారావు, పద్మనాభరెడ్డి, మునీంద్ర, వెంకటేష్, రిటైర్డ్ ఉపాధ్యాయ అమర్నాథరెడ్డి, భారతి పాల్గొన్నారు.

గణిత ప్రజ్ఞాధారణ కార్యక్రమంలో ఎంఈవో విద్యార్థులు, ఉపాధ్యాయులు

## ఆదరించినందుకు అందుబాటులో ఉంటా..

- ప్రగతి పథంలో గ్రామాన్ని నడిపిస్తా..
- సర్పంచ్ పవన్‌కుమార్

**ప్రజాశక్తి-గంగవరం:** 'ఆదరించారు.. అభిమానించారు.. నమ్మకంతో ఆశీర్వదించారు.. అందరికీ అందుబాటులో ఉంటూ గ్రామాన్ని ప్రగతి పథంలో నడుపుతా" అని గంగవరం మండలం మేలుమయి సర్పంచ్ పవన్‌కుమార్ అన్నారు. తన పంచాయతీలో చేపడుతున్న అభివృద్ధి పనులపై ఆయన మాట్లాడుతూ గ్రామాలకు కావలసిన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ సహకారంతో ఇప్పటికే రెండు గ్రామాల్లో ఓవర్ హెడ్ ట్యాంకులు, రెండు కిలోమీటర్ల పొడవైన డ్రైనేజీ కాలువలు, వీధుల్లో సిమెంటు రోడ్లు పూర్తి చేశామన్నారు. మరమ్మతులకు గురైన విధి దీపాల స్థానంలో కొత్తవి అమర్చామని, ప్రజలకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. మరింత అభివృద్ధికి తోడ్పడతానని ఈ సందర్భంగా సర్పంచ్ పవన్‌కుమార్ తెలిపారు.

## యువకుడి ఆత్మహత్య

**ప్రజాశక్తి-బంగారుపాళ్యం:** ఇంట్లో ఎవరూ లేని సమయంలో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని తగ్గువారిపల్లి పంచాయతీ ఇందిరమ్మ కాలనీకి చెందిన రంజిత్(23) ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆ సమయంలో తల్లిదండ్రులు వ్యవసాయ పనులకు వెళ్లారు. తిరిగొచ్చే సమయానికి రంజిత్ ఫ్యానుకు వేలాడుతూ కనిపించాడు. అతన్ని ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## బస్టాండులో వ్యక్తి మృతి

**ప్రజాశక్తి-సోమల:** మండల కేంద్రమైన సోమల బస్టాండు సమీపంలోని నంజంపేట మార్గంలో బుధవారం ఉదయం ఓ గుర్తు తెలియని వ్యక్తి అకస్మాత్తుగా అపస్మారక స్థితిలోకి వెళ్లి పడిపోయాడు. స్థానిక ఆటో కార్మికులు గుర్తించి అతన్ని లేపి కూర్చొబెట్టిన కొంత సమయానికి అతను మృతి చెందాడు. అచూకీ కోసం ప్రయత్నంలో అతని పేరు లక్ష్మీపతి, చౌడేపల్లి మండలం దొనపల్లి స్వగ్రామంగా గుర్తించారు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు అక్కడకు చేరుకొని బోరున విలపించారు. గొర్రెల వ్యాపారం కోసం సోమల వైపు వచ్చినట్లు కుటుంబ సభ్యులు అనుమానంగా చెప్పారు.

## ఘనంగా గంగమ్మ జాతర

**ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి:** మండలంలోని లక్కనపల్లి గ్రామంలో ఆనవాయితీగా జరుగుతున్న పెదపూడి గంగమ్మ జాతరను సర్పంచ్ కృష్ణరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ జాతరలో ప్రముఖులు అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటూ బ్యాండ్ మేళాలతో పాటల పోటీలతో దీపారాధనలతో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, నాయకులు పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వారికి కావలసిన ఏర్పాట్లను సర్పంచ్ కృష్ణారెడ్డి పర్యవేక్షించారు.

గంగమ్మ జాతరలో సర్పంచ్, నాయకులు

## ఘనంగా 'ఐఓబీ' వార్షికోత్సవం

**ప్రజాశక్తి-సదుం:** స్థానిక ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, సదుంశాఖలో బ్యాంకు పదవ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించినట్లు బ్యాంకు మేనేజర్ రాంబాబు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన బ్రాంచి ఖాతాదారులతో కేకును కట్ చేపించి, ఖాతాదారులకు, బ్యాంక్ సిబ్బందికి పంచి పెట్టారు. ఈ సందర్భంగా ఖాతాదారులకు ఎస్.ఆర్ కంటి హాస్పిటల్ వారిచే ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో అమ్మగారిపల్లి మాజీ సర్పంచి గౌరీ కుమార్ రెడ్డి, పాలమంద సర్పంచి మనోహర్ రెడ్డి, కువైట్ హరినాథ్ రెడ్డి, వెంకటరమణా రెడ్డి, హేమచంద్రా రెడ్డి, బ్యాంక్ మిత్ర లోకేష్ పాల్గొన్నారు.

## 'టీడీపీ రాగానే సమస్యల పరిష్కారం'

**ప్రజాశక్తి-బంగారుపాళ్యం:** అధికారం చేపట్టిన మూడు నెలల్లో సమస్యలను పరిష్కరిస్తామని టిడిపి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్ అన్నారు. బుధవారం మండలంలోని తంబుగానే పల్లి పంచాయతీ వెంకటాపురం గ్రామాల్లో ప్రచార కార్యక్రమం జరిగింది. గ్రామస్తులు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో నాయకులు శ్రీధర్, జయప్రకాష్‌నాయుడు, మహేంద్ర, లోకనాథంనాయుడు, రమేష్, గిరిబాబు, కిషోర్, హరిబాబు, బాలకృష్ణ పాల్గొన్నారు.

## పాఠశాలల తనిఖీ

**ప్రజాశక్తి-సోమల:** మండలంలోని పలు ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలను ఏఎల్ఎస్‌వో కోఆర్డినేటర్ అజయ్‌కుమార్ రెడ్డి బుధవారం తనిఖీలు నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల వర్క్ బుక్స్ తనిఖీ నిర్వహించి ఏ విధంగా రాశారు, ఉపాధ్యాయులు కరెక్షన్ చేశారా లేదా ఎన్ని మార్కులు వేశారు అన్న విషయాలను విద్యార్థుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఆయన కూడా కొన్ని ప్రశ్నలు విద్యార్థులకు సంధించి వారి వద్ద నుండి సమాధానాలను రాబట్టారు. విద్యార్థి దశ నుండే అందమైన అక్షరాలను రాసే విధానాన్ని నేర్చుకోవడానికి వారికి కాపీ రైటింగ్ బుక్స్ తెప్పించి అందులో అక్షరాలు గుండ్రంగా రాసే విధంగా నేర్పించాలని నేడు విద్యార్థి దశ నుండే నేర్చుకుంటే పై చదువులకు వెళ్ళినప్పుడు అక్షరాలు బాగా అందంగా రాసే అవకాశం ఏర్పడుతుందని ప్రధానోపాధ్యాయులు ఎల్లయ్యకు సూచించారు. నంజంపేట జడ్పీ హైస్కూల్, ప్రాథమిక పాఠశాలను తనిఖీ నిర్వహించి విద్యార్థుల పుస్తకాలను, ప్రభుత్వం విద్యార్థులకు సరఫరా చేసిన ట్యాబ్‌లను పరిశీలించి, మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ నిర్వహించారు. కార్యక్రమంలో సిఆర్‌పి సోమశేఖర్ పాల్గొన్నారు.

## పారదర్శకంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు

- పూతలపట్టు నియోజకవర్గం వైసీపీ అభ్యర్థి సునీల్‌కుమార్

ఇంటింటి ప్రచారంలో సునీల్‌కుమార్

**ప్రజాశక్తి-బంగారుపాళ్యం:** ప్రభుత్వ సంక్షేమ పథకాలను పూర్తి పారదర్శకంగా లబ్ధిదారులకు అందజేస్తున్నట్లు పూతలపట్టు నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి సునీల్‌కుమార్ తెలిపారు. మండలంలోని కరిడివారిపల్లి పంచాయతీలో బుధవారం మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సునీల్ కుమార్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి తలపెట్టిన సంక్షేమ పథకాలు భవిష్యత్తులో జరగాలంటే ఆయన మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాలని అందుకు ప్రతి ఒక్క నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అమరావతి, జెడ్పిటిసి సోమశేఖర్, నాయకులు శిరీష్‌రెడ్డి, దత్తాత్రేయ రెడ్డి, సర్దార్, కిషోర్‌కుమార్ రెడ్డి, ధనంజయరావు, కృష్ణమూర్తి, శరత్‌రెడ్డి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## పైపులైన్లు ఏర్పాటు

పైపులైన్‌లు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

**ప్రజాశక్తి - సోమల:** మండలంలోని కందూరు గ్రామంలోని బస్టాండ్ కూడలి, వీధులలో నూతన త్రాగునీటి పైప్లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. సర్పంచి బాషామసూద్ వివరాల మేరకు కలికిరి-సోమల ప్రధాన రహదారి విస్తరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో కందూరు గ్రామంలోని ప్రధాన రహదారి రోడ్డు విస్తరణ పనుల కారణంగా పైపులు పగిలిపోవడం జరిగిందని, దీంతో ప్రజలు త్రాగునీటి కష్టాలు ఎదుర్కోకూడదన్న సదుద్దేశంతో నూతన పైపులైన్లను కనెక్షన్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మెకానిక్ బాషా, పంచాయతీ కార్యదర్శి జయశంకర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.